క్లుప్తంగా

అడిషనల్ కలెక్టర్‌ను కలిసిన మెప్మా పీడీ



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్‌ను సోమవారం కలెక్టరేట్‌లో మెప్మా పీడీ ఎంకేఐ అలీ మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే అందజేశారు. కార్యక్రమంలో డీఎంసీ శివకుమార్, జూనియర్ అసిస్టెంట్ వి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీకి తరలిన నాయకులు

జడ్చర్ల టౌన్: ఢిల్లీలో ఈనెల 20న నిర్వహించే ధర్నా కార్యక్రమానికి టీఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం జడ్చర్ల నుంచి బయలుదేరి వెళ్లారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరసనోళ్ల బాల్‌రాజు ఈ సందర్భంగా మాట్లాడారు. వర్గీకరణ బిల్లుపై కాలయాపన చేస్తుండటం తగదన్నారు. అంతకుముందు సిగ్నల్‌గడ్డ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు

బాలానగర్: గౌతాపూర్ విజయ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశికోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు హరిబాలానంద దాసు తెలిపారు. ఈ నెల 22న వైకుంఠ ద్వార దర్శనం, కళశాభిషేకం, హోమం, అన్నప్రసాద కార్యక్రమం, గరుడ వాహన సేవ, భజన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. 23న స్వామి వారి కల్యాణం, శేషవాహన సేవ, రథోత్సవం, అఖండ భజన కార్యక్రమాలు ఉంటాయని భక్తులు పెద్దసంఖ్య పాల్గొనాలని కోరారు.

కరాటేకు గుర్తింపు ఇవ్వాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: కరాటేకు ప్రభుత్వం గుర్తింపు ఇచ్చేలా తమవంతు కృషి చేయాలని కోరుతూ సోమవారం పలువురుమాస్టర్లు హైదరాబాద్‌లో కరాటే ఇండియా ఆర్గనైజేషన్స్ తెలంగాణ అధ్యక్షుడు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. డ్రాగన్ షోటోకాన్ కరాటేడూ స్పోర్ట్స్ ఫౌండర్ సాలంబబిన్ ఉమర్, నేషనల్ వైస్ చైర్మన్ ఆర్.మల్లికార్జున్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. మాస్టర్లు అమ్రేష్, శేఖర్, మోసేస్, ఫహీం, సలీం, అంజన్‌ప్రసాద్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో ప్రత్యేక పార్థనలు



కోయిలకొండ: తెలంగాణాలో అధికారంలోకి రావడం, మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే గెలుపొందడంపై మండల కేంద్రంలోని షా అబ్దుర్ రహిమాన్ దర్గాలో నాయకులు మక్సూద్ హుస్సేన్, మొయిన్‌అలీ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా విందు నిర్వహించారు. సీనియర్ నాయకుడు ఎన్పీ వెంకటేశ్, ఖాజి గౌస్ మొహియోద్దీన్, మదీనా మజీద్ కమిటీ అధ్యక్షుడు అవద్‌బిన్ బాహియాల్, జిల్లా మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఉర్సు

చిన్నచింతకుంట: దమగ్నాపురంలో హజరత్ మహబుబ్ సుభానీ ఉర్సు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు చేపట్టండి

స్టేషన్ మహబూబ్‌నగర్: జీహెచ్‌ఎం పదోన్నతులు చేపట్టాలని ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లాకు చెందిన కొంతమంది ఉపాధ్యాయులు కోర్టుకు వెళ్లడం వల్ల మల్టీజోన్ 2లోని పంచాయతీరాజ్ పాఠశాలల్లో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పదోన్నతులు నిలిపివేశారని, వాటిని వారం రోజుల్లో ఇస్తామని మాయమాటలతో మభ్యపెట్టిన ప్రభుత్వం ఓటమి పాలైందని పేర్కొన్నారు. ఒకే రాష్ట్రంలో మొదటిజోన్‌లో పదోన్నతులు చేపట్టి రెండో జోన్‌లో చేపట్టకపోవడం గత ప్రభుత్వానికే చెల్లిందన్నారు. చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీఆర్టీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు గట్టు వెంకట్‌రెడ్డిపై ఈ నెల 2న జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నారాయణగౌడ్, రఘురాంరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతేకాకుండా టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి ఇంటిపై కూడా దాడి చేసి వస్తువులను ధ్వంసం చేశారని పోలీసులు కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కరపత్రం ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ రూరల్: మాలల చైతన్య సమితి 8వ ఆవిర్భావ దినోత్సవ కరపత్రాలను సోమవారం జిల్లా కేంద్రంలో వ్యవస్థాపక అధ్యక్షుడు మూలె కేశవులు ఆవిష్కరించారు. ఈనెల 27న జిల్లాకేంద్రంలో కార్యక్రమం ఉంటుందని అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. యాదయ్య, వెంకట్రాములు, శివశంకర్, మహేందర్, ఆంజనేయులు, మహేందర్, బాలయ్య పాల్గొన్నారు.

రక్తదానం జీవన దానం



రక్తదాన శిబిరంలో ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ రవినాయక్

● కలెక్టర్ రవినాయక్

జడ్చర్ల/జడ్చర్ల టౌన్: రక్తదానం చేయడం వలన మరొకరికి ప్రాణ దానం చేసినట్లవుతుందని జిల్లా కలెక్టర్ రవినాయక్ అన్నారు. సోమవారం మండలంలోని పోలేపల్లి ఫార్మసెజ్‌లో ఉన్న ఎస్‌విఎంఐఎస్ యూనివర్సిటీలో రెడ్‌క్రాస్ సొసైటీ–నిశ్చయ్, విద్యార్థి సామాజిక బాధ్యత కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు.

ప్రతి ఒక్కరు రక్తదానం చేయటం అలవర్చుకోవాలని, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నటరాజ్ ఇప్పటి వరకు 156 సార్లు రక్తదానం చేశారని ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రక్తదానం చేయటం వల్ల ప్రజల జీవితాలలో సానుకూల ప్రభావం ఎలా ఉంటుందో వివరించారు. ప్రతి ఒక్కరి శ్రేయస్సుకోసం యువత భద్రత చర్యలు, ట్రాఫిక్ నియమాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌అండ్‌టీ టోల్‌గేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ దీప, ఎస్‌ఎంఐఎంఎస్ హైదరాబాద్ డిప్యూటీ రిజిస్ట్రార్ డా.మహేష్‌కుమార్, అసోసియేట్ డీన్ డా. సునీత పాల్గొన్నారు. కాగా శిబిరంలో 109 యూనిట్లు రక్తం సేకరించారు.

విద్యార్థులకు ఉన్నత విలువలు నేర్పించాలి..

విద్యార్థులకు చిన్నతనం నుంచే ఉన్నత విలువలు నేర్పించాలని కలెక్టర్ రవినాయక్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన పోలేపల్లి ఫార్మాసెజ్‌లోని ఎస్‌వీకేయం పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు సామర్థ్యాలను పరిశీలించారు. తరగతి గదులు, ప్లేఏరియా, డాన్స్ స్టూడియో, ఐటీసీ కంప్యూటర్ ల్యాబ్, ఆడిటోరియం, కెఫెటేరియా, ఇండోర్‌ప్లేగ్రౌండ్, నర్సింగ్‌స్టేషన్ నిర్వహణ పరిశీలించారు. పాఠశాలలో జూనియర్‌రెడ్‌క్రాస్‌ను ఆయన ప్రారంభించారు. విద్యార్థుల్లో సేవాభావం ముఖ్యమన్నారు. ఆయన వెంట రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్, ప్రిన్సిపాల్ ఎబినేజర్ ఉపాధ్యాయులు ఉన్నారు.

అభివృద్ధిపైనే ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

గండేడ్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి అభివృద్ధిపైనే ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎంపీపీ మాధవి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఉమ్మడి మండలం జోగులాంబ జోన్‌లో ఉండడంతో తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. నిరుద్యోగుల ఆవేదనను దృష్టిలో ఉంచుకొని కచ్చితంగా చార్మినార్‌జోన్‌లో కలిపేలా చూస్తామన్నారు. సీపీఎస్ రద్దుకు కృషిచేస్తామని వివరించారు. గండేడ్‌కు రూర్బన్ కింద రూ. 100 కోట్లు మంజూరు చేయించామని వివరించారు. కాగా గ్రామాల్లో విద్యుత్‌పై సమస్యలపై పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా పాఠశాలల్లో సమస్యలను వివరించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. డిపార్టుమెంట్ల వారీగా సమీక్ష ఉంటుందన్నారు. జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఈశ్వరయ్య, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి, తహసీల్దార్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంతకుముందు ఎమ్మెల్యేను ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు ఘనంగా సన్మానించారు.

మహమ్మదాబాద్: ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి ఉమ్మడి మండల కాంగ్రెస్ నాయకులు గాధిర్యాల్ గేట్ వద్ద ఘన స్వాగతం పలికారు. వర్కింగ్ ప్రెసిడెంట్ రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. గ్రామస్తులు గాధిర్యాల్, చౌదర్‌పల్లి మరో 10 తండాలను కలుపుకుని ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేయాలని ఆయనను కోరారు. దీంతో చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కేశవులు, బాల్‌రాజ్, వెంకట్రాములు, హన్మంతు, వెంకటయ్య, అంజి, మల్కయ్య, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా మహా పడిపూజ



తిర్మలాపూర్‌లో అయ్యప్ప పడిపూజ

బాలానగర్: పెద్దాయపల్లి శివారులోని దుందుభీ నది తీరాన అయ్యప్ప ఆలయంలో మహాపడిపూజ సోమవారం కనుల పండువగా సాగింది. ఆలయ కమిటీ చైర్మన్ రమేష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సాయి రెడ్డి, సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. ఆలయాన్ని వేడుక సందర్భంగా సర్వాంగా సుందరంగా ముస్తాబుచేశారు. రాత్రి 9 గంటలకు గురుస్వామి దేవనాయర్ తాంత్రీ ఆధ్వర్యంలో జరిగిన పూజలను వీక్షించేందుకు వివిధ గ్రామాల ప్రజలు వందల సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తులు ఆలపించిన పాటలతో ప్రాంగణమంతా మార్మోగింది. భక్తులకు కొత్తకాపు వెంకట్ రెడ్డి అన్నప్రసాదాలను సమకూర్చారు. 16 సంవత్సరాలుగా కార్యక్రమం నిర్వహిస్తున్న ఆయనను ఆలయ కమిటీ సభ్యులు అయ్యప్ప వస్త్రాలతో సన్మానించారు. యాదగిరిగౌడ్, గురుస్వాములు శ్రీను, తిరుపతి, మహేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటచారి, సాటి శ్రీనివాస్ యాదవ్, సర్పంచ్ శంకర్, వెంకట్ రెడ్డి, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

రాజాపూర్: తిర్మలాపూర్‌లో సోమవారం నారికేల గురుస్వామి వెంకటయ్యగౌడ్ ఆధ్వర్యంలో శ్రీభ్రమరాంభమల్లికార్జునస్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి పడిపూజ కనుల పండువగా నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.



పెద్దాయపల్లి శివారులో మహాపడిపూజ



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మహమ్మదాబాద్: సుబ్రహ్మణ్య షష్టి మహోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక అభిషేకం, పల్లకీసేవ, తీర్థప్రసాదాల పంపిణీ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గురుస్వాములు రాజశేఖర్‌గౌడ్, లక్ష్మీకాంత్ రెడ్డి, గోపాల్, బాల్‌రాజ్, శ్రీనివాస్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో గ్రంథాలయం



కూలడానికి సిద్ధంగా పుస్తకాల గది

ధన్వాడ: మండల కేంద్రంలో 36ఏళ్ల క్రితం గ్రంథాలయాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీన్ని 20 ఏళ్ల కిందట ప్రత్యేకంగా భవనం నిర్మించి అందులోకి మార్చారు. కానీ నాసిరకంగా నిర్మించడంతో కొద్ది రోజులకే శిథిలావస్థకు చేరింది. భవనం పైకప్పు పెచ్చులు ఊడుతున్నాయి. చిన్నపాటి వర్షం వచ్చినా పుస్తకాలు తడిసి ముద్దవుతున్నాయి. అంతేకాకుండా ఇక్కడ విద్యుత్ సౌకర్యం కల్పించలేదు. అటెండర్‌తోనే గ్రంథాలయ నిర్వహణ కొనసాగిస్తున్నారు. పుస్తకాలకు చెదలు పట్టి పనికిరాకుండా పోయాయి. చుట్టూ ప్రహరీ, మరుగుదొడ్ల సౌకర్యాలు కూడా లేవు. ఉన్న స్థలాన్ని కూడా కొందరు కబ్జా చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సౌకర్యాలు కల్పించాలని పాఠకులు కోరుతున్నారు.

కల్తీ మద్యం అరికట్టండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర: గ్రామాల్లో కల్తీ మద్యం, సారాను పూర్తి స్థాయిలో అరికట్టాలని ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి కోరారు. సోమవారం దేవరకద్రలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎక్సైజ్ అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. బెల్టు షాపుల పై నిఘా ఉంచాలని కోరారు. యువత కల్తీ మద్యం బారిన పడకుండ చర్యలు తీసుకోవాలని కోరారు.

కార్యకర్తలే మా బలం

భూత్పూర్: కార్యకర్తలే తమ బలమని, ఎళ్లవేళలా రుణపడి ఉంటానని ఎమ్మెల్యే జి. మధుసుదన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో కార్యకర్తలతో విజయోత్సవ సమావేశం నిర్వహించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పార్టీని గెలిపించేందుకు కృషిచేయాలన్నారు. త్వరలోనే బీఆర్‌ఎస్ కనుమరుగవుతుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం గుడ్‌మార్నింగ్ దేవరకద్ర కార్యక్రమం నిర్వహిసున్నట్లు వివరించారు. మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు వెంకట్ నర్సింహారెడ్డి, టౌన్ అధ్యక్షుడు నవీన్ గౌడ్, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముని అక్షింతల ఊరేగింపు



మహమ్మదాబాద్: అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముని అక్షింతలు, కరపత్రాలు మండల కేంద్రానికి చేరాయి. వాటిని మహమ్మదాబాద్ బస్టాండ్ నుంచి హనుమాన్ ఆలయం వరకు మేళతాళాలతో భజన సంకీర్తనల ఊరేగింపుగా తీసుకెళ్లారు. బాల్‌చందర్, అనంతయ్య గుప్త, శ్రీరాములు తదితరులు ఉన్నారు.

గండేడ్: అయోధ్య రాముని అక్షింతలు రెడ్డిపల్లికి సోమవారం చేరుకున్నాయి. ఈ సందర్భంగా గ్రామంలో భజన మండలి సభ్యులు ఊరేగింపు నిర్వహించారు. జిల్లా ధర్మ జాగరణ విధి ప్రముఖ్ జనార్దన్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకాన్ని ప్రారంభించడంతో ఆటో డ్రైవర్లు దిక్కుతోచని స్థితిలోకి వెళ్లిపోయారని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం ఆహ్వానించదగ్గదే అయినా ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. ఆటో డ్రైవర్లకు నెలకు రూ. 24 వేలు ఇవ్వాలన్నారు. ఆటోలపై రుణాలను ఏకకాలంలో మాఫీ చేయాలన్నారు. ఆటో డ్రైవర్లకు అండగా ఉంటానని పేర్కొన్నారు.

జడ్చర్ల టౌన్: ప్రభుత్వం తమను ఆదుకునేలా చూడాలని ఆటో యూనియన్ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ హాజీ అన్నారు. సోమవారం యూనియన్ ఆధ్వర్యంలో సిగ్నల్‌గడ్డపై ఆటోలు ఉంచి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ సత్యానారాయణరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. పలువురు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

చిన్నచింతకుంట: దమగ్నాపురంలోని ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి నివాసంలో సోమవారం 2024 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఎమ్ సాయిబాబ, మండల అధ్యక్షుడు దండు వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం

అడ్డాకుల: కాటవరం గ్రామానికి చెందిన హరిజన్ బాలయ్య అనారోగ్యంతో మృతి చెందగా.. బాధిత కుటుంబాన్ని సోమవారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తోట శ్రీహరి పరామర్శించారు. బాలయ్య మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సూచన మేరకు రూ.5వేల ఆర్థిక సాయం బాధిత కుటుంబానికి అందజేశారు.

గండేడ్: వెన్నాచేడ్‌కు చెందిన గోపాల్ ఆదివారం రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందగా సోమవారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు చెన్నయ్య ఆధ్వర్యంలో అంత్యక్రియల కోసం రూ. 9వేలను బాధిత కుటుంబానికి నాయకులు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

అడ్డాకుల: మూసాపేట మండలం చక్రాపూర్ స్టేజీ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి..జానంపేటకు చెందిన సాయిలు జాతీయ రహదారి వద్ద మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు వైపు నుంచి రోడ్డు దాటుతుండగా మహబూబ్‌నగర్ నుంచి కొత్తకోట వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో సాయిలు కాలు ఫ్యాక్చర్ కావడంతో తీవ్ర రక్తస్రావమైంది. స్థానికుల సమాచారంతో టోల్‌ప్లాజా అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స నిర్వహించి జిల్లా కేంద్రానికి తరలించారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

కంప చెట్లను తొలగించాలి



అడ్డాకుల: మండల కేంద్రంలోని చౌట చెరువు కట్టపై కంప చెట్లు ఏపుగా పెరిగాయి. కట్టపై ఇరువైపులా ముళ్ల కంప పెరగడంతో వాహనాలు వెళ్లడానికి వీలు లేకుండా మారింది. గతంలో మిషన్ కాకతీయ కింద చెరువుకు మరమ్మతు చేయించినప్పుడు కంప చెట్లను తొలగించారు. తర్వాత మళ్లీ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఈ కట్ట రోడ్డుపై తాళ్లగడ్డ గ్రామస్తులు రాకపోకలు సాగిస్తుంటారు. రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందంటున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధిహామీ కింద కంప చెట్లను తొలగించే విధంగా చర్యలు చేపడితే మేలు జరుగుతుందని పలువురు పేర్కొంటున్నారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనే ధ్యేయం



ఊట్కూరు: భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి చేద్దామని పీవైఎల్ ఉపాధ్యక్షుడు సిద్దు అన్నారు. సోమవారం మండలంలోని బిజ్వార్‌లో పీవైఎల్, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ విగ్రహావిష్కరణ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21న పాతపల్లిలో భగత్‌సింగ్ విగ్రహావిష్కరణ ఉంటుందని కార్యక్రమానికి ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. మండలంలోని యువత పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. విద్యార్థులు, యువకులు చిన్నతనం నుంచే దేశభక్తిని అలవరుచుకోవాలని దేశనాయకుల జీవిత చరిత్రలు చదవాలని కోరారు. కార్యక్రమంలో పార్ల నర్సింహులు, కొండప్ప, రాము తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: మండలంలోని పాతపల్లిలో 21న నిర్వహించనున్న భగత్‌సింగ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం విజయవంతం చేయాలని సీపీఐ ప్రజా పంథా పార్టీ నాయకుడు రాము కోరారు. సోమవారం పాతపల్లిలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.

పీఏసీఎస్ ఇన్‌చార్జ్ చైర్మన్ నియామకం

మద్దూరు: దమగ్నాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఇన్‌చార్జ్ చైర్మన్‌గా ఆంజనేయులు సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. చైర్మన్‌గా ఉన్న జగదీశ్వర్ తన పదవికి శనివారం రాజీనామా చేయడంతో వైస్ చైర్మన్‌గా ఉన్న భూనీడ్ డైరెక్టర్ ఆంజనేయులు ఇన్‌చార్జ్ చైర్మన్‌గా నియామకమయ్యారు. కొత్త చైర్మన్ ఎన్నిక ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత ఎన్నుకోనున్నట్లు సీఈఓ మహిపాల్ తెలిపారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

భూత్పూర్: తన జీవితం ప్రజాసేవకు అంకితమని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం అన్నాసాగర్‌లో నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. మాజీ జెడ్పీటీసీ చంద్రమౌళి, నారాయణ గౌడ్, మహ్మద్ సాధిక్, మత్స్య సంఘం అధ్యక్షుడు సత్యానారాయణ, మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, కాటం ప్రదీప్ కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

22న వేసెక్టమీ శిబిరం

పాలమూరు: జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఈనెల 22న వేసెక్టమీ వెసక్టమి ఆపరేషన్స్ క్యాంపు ఉంటుందని ఎంహెచ్‌ఎన్ పీవో డాక్టర్ భాస్కర్ నాయక్ వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా అవగహన కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. సోమవారం ఆస్పత్రి ఆవరణలో కరప్రతాలు ఆవిష్కరించారు. కుటుంబ నియంత్రణలో మగవారి బాధ్యత మరింత పెరగాలని ఆపరేషన్లు చేసుకోవడానికి ముందుకురావాలన్నారు. ఆపరేషన్ చేసుకున్న వారికి రూ.1100 ప్రోత్సాహక నగదు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా క్షయ నియంత్రణ అధికారి రఫీక్, మాస్‌మీడియా అధికారి జి.తిరుపతిరావు సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల స్థలం కబ్జాపై విచారణ చేపట్టాలి

నవాబుపేట: యన్మన్‌గండ్ల జెడ్పీస్కూల్ స్థలం కబ్జాపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ రాంచంద్రయ్య తెలిపారు. స్థలాన్ని గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తన వ్యవసాయ పొలానికి రోడ్డు వేసేందుకు కబ్జా చేశాడని ఆరోపించారు. సోమవారం మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేస్తామన్నారు.

విద్యార్థికి అభినందన



మహబూబ్‌నగర్ క్రీడలు: రాజస్థాన్‌లో వచ్చే నెల 9 నుంచి 13 వరకు జరిగే జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–14 బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లా కేంద్రంలోని అపెక్స్ స్కూల్ విద్యార్థి పారిజాత ఎంపికైంది. కాగా పారిజాతను సోమవారం పాఠశాలలో డైరెక్టర్ రామారావు, ఏఏఓ నాగమణి, ప్రధానోపాధ్యాయుడు చైతన్యరెడ్డి అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఈటీలు మహ్మద్ ఉస్మాన్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

శౌర్య దివస్‌లో పాల్గొనాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తెలంగాణ మాల మహానాడు ఆధ్వర్యంలో జనవరి 1న నిర్వహించే భీమా కోరేగావ్ శౌర్య దివస్ కరపత్రాలను సోమవారం జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విడుదల చేశారు. అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మంత్రి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట సంత.. సమస్యల చింత



నవాబుపేట సంతలో జనం

నవాబుపేట: మండలకేంద్రంలో సంత అంటేనే రోడ్డుతో చింత అనేవిధంగా స్థానికులు, వివిధ గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం వచ్చిందంటే మండల కేంద్రంలో వేలాది మంది జనం కనీసం నడవటానికి సరిగ్గా రానంతగా దాదాపుగా 3 కిలోమీటర్ల పొడవులో సంత ఉంటోంది. జనం జాతర మాదిరిగా వస్తుండటంతో మండల కేంద్రం కిక్కిరిసి పోతోంది. కాగా సంతకు వచ్చే వారికి కనీస సౌకర్యాలు లేకపోతుండడంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. మూత్రశాలలు వంటివి కూడా లేకపోవడతో ప్రదానంగా మహిళలు అవస్థలు ఎదుర్కొవలసి వస్తోంది. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి కనీస సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు.

సమస్య పరిష్కరిస్తాం..

సంతకు వచ్చే జనంతో రోడ్డు జాం అవుతోంది. త్వరలోనే రోడ్డు సమస్యకు పరిష్కారం చూస్తాం. అలాగే మార్కెట్‌కు వచ్చే వారికి కనీస సౌకర్యాలు కల్పించేందుకు ప్రతిపాదనలు చేస్తున్నాం. సమస్యలకు శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషిచేస్తాం.

– గోపాల్‌గౌడ్, సర్పంచ్, నవాబుపేట

రోడ్డు సమస్య తీవ్రం...

నవాబుపేటలో ఆదివారం రోజు దాదాపు మూడు కిలో మీటర్లకు పైగా సంత ఉంటుంది. దీంతో అటువైపు ఉన్న లోకిరేవు, లింగంపల్లి, రేకులచౌదాపూర్, కాకర్‌జాల్ గ్రామాలకు దారి మూసుకుపోతోంది. దాదాపు ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల దాకా ఈ దారిలో కనీసం నడిచే పరిస్థితి కూడా ఉండడం లేదు. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లేవారు సాయంత్రం దాకా వేచి చూడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాలకు వెళ్లే ప్రజలు అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించాలని చర్యలు తీసుకోవాలని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

ఓటర్ల నమోదుకు మరో అవకాశం

దేవరకద్ర: కొత్త ఓటర్ల నమోదుకు ఎన్నికల కమిషన్ మరో అవకాశం ఇచ్చిందని తహసీల్దార్ బ్రహ్మంగౌడ్ తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన బీఎల్‌ఓల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 1 వరకు అర్హులందరినీ ఓటర్లుగా నమోదు చేయించాలని సూచించారు. అదేవిధంగా అడ్రస్ మార్పు, తప్పుల సవరణకు దరఖాస్తులను తీసుకోవాలని కోరారు. ఆన్‌లైన్‌లో వచ్చే దరఖాస్తులను పరిశీలించి విచారణ చేయాలని తెలిపారు.